క్లుప్తంగా

అప్పనపల్లిలో నదీకోతను పరిశీలించిన ఎంపీ



అప్పనపల్లిలో గోదావరి నదీకోతను పరిశీలిస్తున్న ఎంపీ అనురాధ

మామిడికుదురు: అప్పనపల్లిలో తీవ్రంగా ఉన్న గోదావరి నదీకోతను అమలాపురం ఎంపీ చింతా అనురాధ సోమవారం పరిశీలించారు. విజయదశమి సందర్భంగా అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకున్న ఎంపీ అనంతరం గోదావరి నదీపాతాన్ని పరిశీలించారు. నివాస గృహాలను సమీపించిన కోతను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి నదీకోత సమస్యను ఎంపీకి వివరించారు. గోదావరి వరదల సమయంలో ఏటా తీర ప్రాంతం కోత బారిన పడుతుందని, కోత నివారణకు గతంలో నిర్మించిన గ్రోయిన్లు కొట్టుకు పోయాయని స్థానికులు ఎంపీకి వివరించారు. దీనిపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఎంపీటీసీ బొంతు సీలిమ, దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న పాల్గొన్నారు.

గుర్రాలక్కకు వెండి శఠారి సమర్పణ



వెండి శఠారి సమర్పిస్తున్న ఆర్డీవో వసంతరాయుడు

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో లక్ష్మీనృసింహుని సోదరి గుర్రాలక్క అమ్మవారి ఆలయంలో సోమవారం ఇటీవల బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లిన అమలాపురం ఆర్డీవో ఎస్వీబీ వసంతరాయుడు వెండి శఠారిని సమర్పించారు. అంతకు ముందు లక్ష్మీనృసింహుని ఆలయంలో కుటుంబ సభ్యులతో పూజలు చేశారు. ఆలయం వద్ద అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి చిత్రపటం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు. అనంతరం గుర్రాలక్క అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఆయన ఆలయానికి వెండి శఠారిని సమర్పించారు.

కష్టించి పనిచేసే వారికి సముచిత స్థానం




పీకే రావును అభినందిస్తున్న ఎంపీ అనురాధ

అంబాజీపేట: వైఎస్సార్ సీపీలో కష్టించి పని చేసే వారికి సీఎం వైఎస్ జగన్ సముచిత స్థానం కల్పిస్తున్నారని అందుకు పీకే రావు నిదర్శనమని అమలాపురం ఎంపీ చింతా అనురాధ అన్నారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పీకే రావును అమలాపురం ఎంపీ చింతా అనురాధ ఆయన స్వగృహంలో సోమవారం రాత్రి కలసి సత్కరించారు. అలాగే టీటీడీ ఎస్వీబీసీ సలహాదారుడు అడపా దుర్గ, అమలాపురం లయన్స్ సీనియర్ మోస్ట్ క్లబ్ సభ్యుడు పీకే రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జున్నూరి బాబి, కొర్లపాటి కోటబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పేరి కామేశ్వరరావును మండల బ్రాహ్మణ సంఘ సమాఖ్య అభినందనలు తెలియజేసింది. మండలంలోని పెదపళ్లకు చెందిన రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి మేడవరపు లక్ష్మణరావు నేతృత్వంలో పురోహితుల బృందం మంగళవారం చైర్మన్ కామేశ్వరరావును అంబాజీపేటలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. దుశ్శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



దాకే సుభాష్‌చంద్రబోస్ (ఫైల్)

మామిడికుదురు: ఆదుర్రు మాజీ సర్పంచ్ దాకే సుభాష్‌చంద్రబోస్ (72) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. సుభాష్‌చంద్రబోస్ కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మోరిపాలెంలో ఇంటి వద్ద మృతి చెందారు. ఆయన మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా గతంలో పని చేశారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

జయజయహే మహిషాసురమర్దిని..

కొత్తపేట/ఆత్రేయపురం/సఖినేటిపల్లి/అంబాజీపేట/మామిడికుదురు/ఆలమూరు: దసరా ఉత్సవాల ఆఖరి రోజు సోమవారం నవమి, దశమి తిథులు పురస్కరించుకుని ఒకే రోజు రావడంతో మహర్నవమి, విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఉదయం మహిషాసురమర్దినిగా, సాయంత్రం రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఆలయాలకు పోటెత్తారు. అలాగే భేతాళస్వామికి ప్రత్యేకపూజలు చేశారు. దీంతో దసరా ఉత్సవాలు సంపూర్ణమయ్యాయి.



అంబాజీపేటలో మహిషాసురమర్దినిగా..



పెదపళ్ల దేవి మండపంలో రాజరాజేశ్వరిగా అమ్మవారు



సిద్ధిదాయిని అలంకారంలో పెదపట్నంలంక కనకదుర్గమ్మ



ఉచ్చిలిలో రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



కొత్తపేట బి.సావరం ఆలయం వద్ద దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న భాస్కర్-వసుధ దంపతులు

జగన్‌తోనే సామాజిక సమన్యాయం

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: ప్రభుత్వ పరంగా, పార్టీ పరంగా పదవులు కల్పనలో సామాజిక సమన్యాయం కల్పిస్తూ, అన్ని వర్గాలకు సంక్షేమ లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ కళ్యాణమండపంలో జగనే ఎందుకు కావాలంటే.. పేరిట మండల వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులు కట్టబెడుతూ, కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలతో ఆర్థిక లబ్ధి చేకూర్చిన ఘనత ఏపీలో జగన్ ప్రభుత్వానిదేనన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ దాదాపు నెరవేర్చి 90 శాతం ప్రజానీకానికి ఆర్థిక ప్రయోజనం కల్పించడం ద్వారా ఉపాధి మార్గాలు చూపారన్నారు. ఈ ప్రభుత్వం తరపున ప్రజలను ఓటు అడిగే హక్కు, ధైర్యం వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. పార్టీలోకి కొత్తవారు వచ్చినా పాతవారికి ఉండే ప్రాధాన్యం ఏ మాత్రం తగ్గదన్నారు. 2014లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేసినా ఇక్కడ తనను గెలిపించి వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడించారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో కూడా మీ అందరి కృషి, సంక్షేమ లబ్ధి పొందిన ప్రజాభిమానంతో మళ్లీ మన జెండా ఎగురుతుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా ముత్యాల వీరభద్రరావు సమర్థవంతమైన పనితీరును గుర్తించి మళ్లీ ఆ బాధ్యతలు అప్పగించినట్టు జగ్గిరెడ్డి తెలిపారు. ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించారు. అలాగే మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా పోతుల చంద్రావతి, మండలంలో 10 గ్రామాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించారు. సలాది బ్రహ్మాజీ (కొత్తపేట), గొల్లపల్లి శ్రీనివాసరావు (వానపల్లి), మట్టా బాబ్జి (వాడపాలెం), రెడ్డి సుభాష్ (అవిడి), భూపతిరాజు సత్యనారాయణరాజు (గంటి), తులా సూరిబాబు (పలివెల), బొక్కా సత్యనారాయణ (ఖండ్రిగ), మామిడిశెట్టి ఏడుకొండలు (మోడేకుర్రు), అడపా దొరబాబు (మందపల్లి), కాకర సర్వేశ్వరరావు (బిళ్లకుర్రు)లను నియమించినట్టు తెలిపారు. అనంతరం వారిని పూలమాలలతో సత్కరించారు. సమావేశంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సాకా జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల, గ్రామ శాఖల అధ్యక్షులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

అధికారులు విధిగా హాజరు కావాలి

మామిడికుదురు: మండల పరిషత్ సమావేశాలకు అధికారులు విధిగా హాజరు కావాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. మామిడికుదురులో ఎంపీపీ కుసుమ వజనకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం జరిగింది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహరహం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే చిట్టిబాబు తెలిపారు. విద్యుత్ లోఓల్టేజ్ సమస్య, పాశర్లపూడిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ తదితర అంశాలను సభ్యులు ప్రస్తావించారు. కొన్ని శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి గైర్హాజరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.21.51 లక్షల అంచనా ఆదాయం, రూ.85 వేలు మిగులు బడ్జెట్‌తో సవరించిన బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. సమావేశంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, వైస్ ఎంపీపీ పిల్లి శ్రీలక్ష్మి, డీటీ శరణ్య, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో విద్యుత్ షాక్‌తో ఇటుక బట్టీ కార్మికుడు అలీ హల్దార్ (34) మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీను కథనం ప్రకారం పశ్చిమబెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాలు ప్రాంతంలోని జిలాయాషిలి జిల్లా పంగి కాలపారా గ్రామానికి చెందిన ఆలీ హల్దార్ గత కొంతకాలంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున మట్టి పని ముగించుకుని మోటారు వేసేందుకు వెళ్లిన హల్దార్ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఇటుక బట్టీ యాజమాన్యం, సహచర కూలీలు ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. ముందు రోజు రాత్రి వర్షం కురవడంతో విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ అయి ఈ ప్రమాదం సంభవించి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించండి

ఆలమూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పడిన తరువాత సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి వల్ల పేద, మధ్య తరగతి వర్గాలకు కలిగిన మేలు, మంచిని ఇంటింటికీ వివరించాలని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆ పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమంపై మండల వైఎస్సార్ సీపీ శ్రేణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పార్టీ శ్రేణులంతా ఒక కుటుంబం మాదిరిగా ఐకమత్యంతో కలసి మెలిసి జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ ఏర్పాటు చేసేందుకు అంకితభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు వాసంశెట్టి దుర్గాభవాని, నేలపూడి రత్నకుమారి, ఎంపీటీసీ ఉన్నమట్ల విజయకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

మండల కన్వీనర్‌గా మూడో సారి 'తమ్మన'

వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభ్యున్నతికి విశేష కృషి చేస్తూ, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్న చెముడులంక సర్పంచ్ తమ్మన శ్రీనివాసును మూడోసారి పార్టీ మండల శాఖ కన్వీనర్‌గా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రకటించి అభినందనలు తెలియజేశారు. రాబోయే 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ గెలుపునకు మరింత ఉత్సాహంతో పనిచేస్తానని బాధ్యతలు చేపట్టిన తమ్మన పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది ఏటిగట్టు వద్ద అగ్నిప్రమాదం

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలోని ఏటిగట్టు వద్ద బ్రహ్మంగారి మఠానికి సమీపాన మంగళవారం బొమ్మిడి నారాయుడు, నాగరాజులకు చెందిన రేకులతో ఉన్న రెండు పోర్షన్ల ఇల్లు అగ్నికి ఆహుతైంది. సిలిండర్ వేడి ధాటికి పేలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో వారంతా దుర్గమ్మ దర్శనానికి గుడికి వెళ్లడంత ప్రమాదం తప్పింది. ప్రమాదంలో ఆస్తి నష్టం రూ.7 లక్షల వరకూ ఉంటుందని బాధితులు తెలిపారు. సర్వస్వం కోల్పోయిన తమను అన్ని విధాలా ఆదుకోవాలని బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమాచారం అందుకున్న రాజోలు ఫైర్ స్టేషన్ సిబ్బంది స్టేషన్ ఆఫీసర్ సీహెచ్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి వెళ్లి మంటలు అదుపు చేశారు.

అశ్లీల నృత్యాల ఏర్పాటు ఘటనలో 8 మంది అరెస్ట్

సఖినేటిపల్లి: అంతర్వేదికర శివారు దిండి కొడపలో సోమవారం కనకదుర్గ అమ్మవారి ఊరేగింపులో అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసిన ఘటనకు సంబంధించి ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై ఎస్.రాము తెలిపారు. ఇందులో భాగస్వాములైన కమిటీ మెంబర్లు, నృత్య కళాకారులు కలిపి ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే ఊరేగింపులో ఏర్పాటు చేసిన సౌండ్ బాక్స్‌లు, బొలెరో వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ఎస్సై మాట్లాడుతూ, అమ్మవారి ఊరేగింపుల్లో ఏ విధమైన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకే పొత్తులు

మలికిపురం: నిరంతరం ప్రజల్లో ఉండి ప్రజా సంక్షేమం కోసం పరితపించే దేశంలోనే అరుదైన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజా క్షేత్రంలో ఎదుర్కొనే ధైర్యం ప్రతిపక్షాలకు లేదని అందుకే పొత్తులతో ముందుకు వస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. మండలంలోని గూడపల్లిలో మంగళవారం చివరి రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రాపాక పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. వలంటీర్లు, అధికారులు, గృహ సారథులు, కన్వీనర్లతో కలసి ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలను ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి వ్యక్తికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాలన ప్రజల వద్దకే తీసుకువచ్చారని, అందుకోసమే వలంటీర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. మహిళా సంక్షేమం కోసం, వారి ఆర్థిక సమృద్ధి కోసం కృత నిశ్చయంతో పని చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తప్పడు ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో మోకా ఉదయ భాస్కర్, దూది సాయిబాబు, సుందర శివ, పున్నం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గూడపల్లిలో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

వేగవంతంగా రోడ్ల నిర్మాణం

రాజోలు: నియోజకవర్గంలో చేపట్టిన పలు ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం రాజోలులో సుమారు రూ.కోటితో నిర్మించిన రాజోలు బైపాస్ సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు వెంబడి మరో రూ.30 లక్షలతో జరుగుతున్న సీసీ డ్రైనేజీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో టి.సావరం-విశ్వేశ్వరాయపురం రోడ్డు, భూపతి వారిపాలెం-మలికిపురం రోడ్ల పనులు పూర్తయ్యాయన్నారు. కొని రోడ్లు ప్రతిపాదనలకు పంపించామన్నారు. అనంతరం రాజోలు భారం వారి వీధిలో ఉన్న కనకదుర్గ అమ్మ వారి ఆలయంలో పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు దార్ల పెదబాబు, బండారు బాబు, బేతినీడి సూరిబాబు, అడబాల సత్యనారాయణ, కాసా రాధాకృష్ణలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. సర్పంచ్ రేవు జ్యోతి, నాయకులు మట్టా ఏడుకొండలు, బండారు కాశీ, ఆకుల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



రాజోలు బైపాస్ సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాపాక

తాగునీటి పైపులైను పనుల పరిశీలన

సఖినేటిపల్లి: స్థానిక మూడుతూములు సెంటర్ వద్ద మంగళవారం తాగునీటి భారీ పైపు నిర్మాణ పనులను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పరిశీలించారు. అంతర్వేది దేవస్థానంలో జేజేఎంలో రూ.17 కోట్ల అంచనాతో నిర్మితమవుతున్న సమగ్ర రక్షిత తాగునీటి పథకంలో చెరువుకు నీటిని సరఫరా చేసేందుకు మూడు తూముల సెంటర్ వద్ద పి.గన్నవరం ప్రధాన పంటకాలువకు పైపు లైను అనుసంధానానికి ఆర్‌డబ్ల్యూఎస్ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఆ శాఖ చేపట్టిన పైపులైను నిర్మాణం పనులను ఎమ్మెల్యే పరిశీలించి, తగు సూచనలు అధికారులకు చేశారు. వెంట ఎంపీపీ వీరా మల్లిబాబు, మాజీ ఎంపీపీ ముత్యాల కాశీ, కె.అశోక్ పాల్గొన్నారు.

అలరించిన దేవనర్తకి నాటక ప్రదర్శన

కొత్తపేట: మండలంలోని వానపల్లి రామాచౌక్ బాల కనకదుర్గ ఆలయం వద్ద దేవీ నవరాత్ర ఉత్సవ పందిరిలో దేవనర్తకి నాటక ప్రదర్శన విశేషంగా అలరించింది. దేవీ నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మాజీ సర్పంచ్, పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన ఎం.శ్రీనివాసరావు నాయుడు సమర్పణలో గీతా శ్రీసాయి కళానికేతన్ వారి నాటకంలో దేవనర్తకిగా ఎం.లతాశ్రీ, సుబ్బారావుగా అప్పన్న, లీలాశుకుడుగా డీఎస్పీ రావు, శంకరంగా సీహెచ్ రాజన్న, శ్రీరంజనిగా టి.సత్యప్రసాద్, గీతగా హిమబిందు అభినయించారు. సందేశాత్మక నాటకంలో నటీనటులందరూ పద్యాలను రసవత్తరంగా ఆలపించి నాటక ప్రియులను ఓలలాడించారు. పలు సన్నివేశాల్లో కామెడీ డైలాగులతో శ్రోతలను కడుపుబ్బ నవ్వించి మెప్పించారు. రంగస్థల నాటక ప్రదర్శనలు ఇచ్చిన పై కళాకారులను కామిశెట్టి అమ్మన్న ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ స్వచ్ఛభారత్ కన్వీనర్ పాలూరి సత్యానందం, వాడపాలెం రంగస్థల పోషకులు సింగిరెడ్డి గోవిందుస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు దొరబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు, వానపల్లి పరిసర గ్రామాల నుంచి కళాభిమానులు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.



వానపల్లిలో రంగస్థల కళాకారులను సత్కరిస్తున్న కామిశెట్టి అమ్మన్న తదితరులు

మహిళలకు గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

కొత్తపేట: మండలంలో మహిళలకు విజయదశమి కానుకగా ఉజ్వల 1.0 పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు సరఫరా చేస్తున్నట్టు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని 533 కుటుంబాలకు ఉజ్వల పథకం ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు కాగా వాటిని సోమవారం సాయంత్రం స్థానిక ఎంపీపీ కార్యాలయ ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పేద మహిళలు కట్టెల పొయ్యి, పొగతో ఇబ్బందులు పడకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు సరఫరా చేస్తున్నాయన్నారు. రూ.5,000 విలువైన స్టౌ కనెక్షన్, నిండు గ్యాస్ సిలిండర్, రెగ్యులేటర్, ట్యూబ్ ప్రభుత్వం ఉచితంగా అందచేస్తుందన్నారు. ఈ పథకంలో రీఫిల్ బుక్ చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రూ.310 బ్యాంక్ ఖాతాకు జమచేస్తుందన్నారు. ఉజ్వల 1.0 పథకంలో వైజాగ్ ఏరియా ఆఫీసు వారు 3000 కనెక్షన్లు మన రాహుల్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వారికి కేటాయించారన్నారు. ప్రభుత్వ చిత్తశుద్ధికి అనుగుణంగా రాహుల్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వారు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం 533 మందికి గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, పార్టీ మండల కన్వీనర్ ఎం.వీరభద్రరావు, రాహుల్ ఇండేన్ గ్యాస్ చైర్మన్ కొవ్వూరి వెంకటేశ్వరరెడ్డి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యులు ముళ్ల జనార్దనరావు, దూళి సూరిబాబు, బొక్కా నాగరాణి, ఏఎంసీ డైరెక్టర్ సాకా జానకిరామరాజు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు మట్టపర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: స్థానిక మహారాజా ప్యాలెస్ వద్ద 373 మందికి గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఉజ్వల పథకంలో భాగంగా ఈ కనెక్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. రూ.5 వేలు విలువ చేసే స్టవ్ కనెక్షన్ మొత్తం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఉజ్వల పథకం ద్వారా బుక్ చేసుకున్న వారికి ప్రభుత్వం తరపున రూ.310 సబ్సిడీ బ్యాంకు ఖాతాకు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, వైస్ ఎంపీపీ పెన్మెత్స బంగార్రాజు, ఎంపీటీసీ సరెళ్ల ధనలక్ష్మి, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు కొల్లి శ్యాంసన్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కార్యకర్తలంతా ఐకమత్యంతో ఉండాలి

ఆత్రేయపురం: గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఐకమత్యంతో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్లజగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. ఆత్రేయపురం మహారాజా ప్యాలెస్ వద్ద పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కార్యకర్తలు ఐకమత్యంతో ఉండి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే తమవద్దకు తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజును ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి మండల కన్వీనర్‌గా కనుమూరి పార్టీకి విశేష సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

అంబాజీపేట: ఎయిడ్స్‌తో బాధపడుతున్న నలుగురు వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను మంగళవారం తొండవరం వెన్నపువారిపేటలో పంపిణీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, కోరుకొండ సత్యనారాయణ (ఢిల్లీ నారాయణ) సూచనల మేరకు నలుగురు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు హైజినిక్, పోషకాహార కిట్లను పంపిణీ చేసినట్లు రెడ్ క్రాస్ జీవితకాల సభ్యులు బెహరా హనుమంత రావు, కేవీవీఎస్ ప్రసాద్, రత్న ప్రసాద్, ఈ పోషకార కిట్లను రెడ్ క్రాస్ సభ్యులు పినిపే మురుగేశ్వరరావు, ఒరిగిటి బాలరాజు సమకూర్చారన్నారు.

చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలిలో సెయింట్ పాల్ లూథరన్ చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. తన హయాంలో నియోజకవర్గంలో సుమారు 50 చర్చిల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోణం సాయిబాబు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, వాడపల్లి దేవస్థానం డైరెక్టర్ మెర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం

అయినవిల్లి: దసరా సందర్భంగా మండలంలోని వీరవల్లిపాలెంలో బాలదుర్గాదేవి ఆలయం వద్ద సప్తాహ భజన కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దసరా పూజలను అర్చకుడు మస్తాన్ కాలీషా ఆధ్వర్యంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో భవానీ భక్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు కాకినాడ జిల్లా పెదపూడి మండలం పైన గ్రామానికి చెందిన అమ్మిన పాపారాయుడు, వెంకటలక్ష్మి దంపతులు మంగళవారం రూ.10,116 విరాళంగా అందించారు. వారికి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు చిట్టాల సత్తిబాబు, ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం

మలికిపురం: మండలంలోని గూడపల్లి శివాలయం వద్ద అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల ఐదో తేదీ వరకూ దాతల ప్రోత్సాహంతో ఉచిత అన్నదానం ఉంటుందని వారు తెలిపారు. అయ్యప్ప భక్తులు స్వీకరించాలని కోరారు.

హెలీనా ప్రాజెక్ట్ వర్క్ స్ఫూర్తిదాయకం

సఖినేటిపల్లి: రాష్ట్ర ప్రగతికి సఖినేటిపల్లికి చెందిన విద్యార్థిని తాడి హెలీనా చేసిన ప్రాజెక్ట్ వర్క్ స్ఫూర్తిదాయకంగా ఉందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. మంగళవారం స్టడీ ఆన్ గవర్నమెంట్ పాలసీస్, ఇట్స్ ఇంప్లిమెంటేషన్‌పై హెలీనా చేసిన ప్రాజెక్ట్ వర్క్‌ను ఎమ్మెల్యే రాపాక, కత్తిమండ క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. దసరా సెలవుల్లో యాజమాన్యం ఇచ్చిన పై ప్రాజెక్ట్ వర్క్ హెలీనా పూర్తి చేసింది. రాజమహేంద్రవరం శ్రీచైతన్య స్కూల్‌లో ఆమె తొమ్మిదో తరగతి చదువుతోంది.

గజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మంగళవారం దసరా పురస్కరించుకుని విజయదశమి సందర్భంగా గజవాహనంపై శ్రీస్వామివారి గ్రామోత్సవం అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత అలంకార మండపంలో గజ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులు, అర్చకులు గ్రామోత్సవానికి స్వామిని తోడ్కొని వెళ్లారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.